





పేరుపాలెం సాగర తీరంలో సముద్ర స్నానం చేస్తున్న సందర్శకులు.. బీచ్‌లో టెర్రాయ్ వాహనంపై సందడి

సండే.. సందడి

కార్తీకమాసం మూడో ఆదివారం జిల్లాలోని పర్యాటక ప్రాంతాలతో పాటు ఆధ్యాత్మిక కేంద్రాలు పర్యాటకులు, భక్తులతో సందడిగా మారాయి. మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌ను సుమారు 10వేల మంది పర్యాటకులు సందర్శించారని అధికారుల అంచనా. బీచ్ సందర్శకులు సముద్రంతో స్నానం చేసి తీరం వెంబడి ఆలయాలను దర్శించుకున్నారు. బీచ్‌లో గుర్రాలపై స్వారీ, ట్రెరాయ్ వాహనాలను నడుపుతూ ఉత్సాహంగా గడిపారు. ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయానికి 15 వేల మంది పైబడి యాత్రికులు విచ్చేసి శ్రీవారు, అమ్మవార్లను దర్శించుకున్నారు. బుట్టాయగూడెం మండలం అటవీ ప్రాంతంలోని గుబ్బల మంగమ్మను భక్తులు అధికసంఖ్యలో దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

- మొగల్తూరు/ ద్వారకాతిరుమల/బుట్టాయగూడెం



ద్వారకాతిరుమల ఆలయ అనివేటి మండప ప్రాంతంలో భక్తుల రద్దీ



గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

» రాష్ట్రీయ బాల స్వస్థ్య పేరుతో కార్యక్రమం » జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహణ

» విద్యార్థుల్లో విటమిన్ లోపాలు, వ్యాధుల నివారణ కోసమే వైద్య పరీక్షలు

భీమవరం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. శనివారం ప్రారంభమైన ఈ కార్యక్రమం దాదాపు మూడు నెలల పాటు జరుగుతుంది. ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటలకు ప్రభుత్వ పాఠశాలల్లో 30 మంది విద్యార్థులకు, ప్రతి గురువారం ఉదయం 10గంటల నుంచి 12 గంటలలోపు అంగన్‌వాడీ కేంద్రాల్లో 30 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాలో 1616 అంగన్‌వాడీ కేంద్రాలు, 1436 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో చదువుకుంటున్న లక్షా 80వేల 287 మంది విద్యార్థులకు పరీక్షలు చేస్తారు. దీనికి సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు.

పరీక్షలు ఇలా ఉంటాయి..

4డి పేరిట చేసే పరీక్షలో విద్యార్థికి జన్యుపరమైన లోపాలు ఉన్నాయా, కాలానుగుణంగా రోగాలు ఉన్నాయా, విటమిన్ ఎ,బి, సి, డి వంటి లోపాలు ఉన్నాయా, ఎదుగుదల లోపాలు ఉన్నాయా అనే వాటిని పరిశీలన చేస్తారు. అటువంటి విద్యార్థులు ఉన్నట్లుగా ఏఎన్ఎంలు గుర్తిస్తే వెంటనే వారికి ఇచ్చిన యాప్‌లో వివరాలను నమోదు చెయ్యవలసి ఉంటుంది. దీని ఆధారంగా మెడికల్ ఆఫీసర్ సంబంధిత రోగులను ఆగ్రామంలో నిర్వహించే వైద్య శిబిరం రోజున పరిశీలన చేసి అవసరమైతే ఉన్నతమైన వైద్యం కోసం సంబంధిత ఆసుపత్రులకు పంపిస్తారు. చిన్న పిల్లలకు సంబంధించిన వైద్యం కోసం ఈజిల్లాలో తణుకులో వైద్యులు ఉండటంతో అక్కడకు సిఫార్సు చేస్తారు. అవసరమైతే ఏలూరులోని మెడికల్ కళాశాలకు పంపిస్తారు. అలా వ్యాధిని బట్టి పంపటం జరుగుతుంది. చర్మ వ్యాధులు, విటమిన్ లోపాలు, చిన్న రోగాలకు సంబంధించి మెడికల్ ఆఫీసర్లు వైద్యం చేసి మందులను అందిస్తారు.

వారానికి 60 మందికే పరీక్షలు

వారానికి 60 మందికి మాత్రమే వైద్య పరీక్షలు చెయ్యవలసి ఉంటుంది. యాప్‌లో అంతకంటే ఎక్కువ మందిని నమోదు చేసినా తీసుకోదు. అందువల్ల గురువారం, శనివారం మాత్రమే సర్వేలో వైద్య పరీక్షలు చెయ్యవలసి ఉంటుంది.

అధికారులతో సమావేశం

రాష్ట్రీయ బాలల స్వస్థత కార్యక్రమం నిర్వహించే ఐసీడీఎస్, బీసీ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, గిరిజన వెల్ఫేర్, విద్యాశాఖ అధికారులతో జిల్లా వైద్యాధికారి డాక్టర్ మహేశ్వరరావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశాన్ని వారికి వివరించారు. ఎవరైనా విద్యార్థులు ఉంటే వారి వివరాలను తెలియజెయ్యాలని కోరారు.

తమ్ముళ్ల కినుక

జిల్లాకు రాష్ట్ర స్థాయి పదవులు వరించాయి. తెలుగుదేశం కూటమి అధిష్ఠానం కూడా జిల్లాకు పెద్దపీట వేశామని భావిస్తోంది. కానీ పార్టీకి కష్టపడ్డ వారిలో ఇప్పుడు అసంతృప్తి నెలకొంది. కూటమి అధికారంలోకి వచ్చినా సరే తమకు గౌరవం లేకుండా పోతోందన్న భావన సీనియర్‌లలో నెలకొంది.



» జిల్లాకు పదవులు సరే..

» ఇన్‌చార్జిల పరిస్థితి ఏమిటో..

» కార్యకర్తల్లోనూ డీలా

» డైరెక్టర్ పదవుల పంపకాల్లోనూ న్యాయం జరగలేదంటూ ఆవేదన

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

నియోజకవర్గాల్లో నేతల ఆదేశాలను పాటిస్తూ పార్టీ బలోపేతానికి పాటు్ట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు డీలా పడుతున్నారు. కూటమి పొత్తులో భాగంగా ఎన్నికల్లో అధిష్ఠానం అందరికీ న్యాయం చేయలేకపోయింది. అయినా గౌరవ మర్యాదలకు భంగం లేకుండా చూసుకుంటామని, పార్టీని కాపాడు కోవాలంటూ తెలుగుదేశం అధిష్ఠానం నియోకవర్గ నాయకత్వానికి దిశానిర్దేశం చేసింది. తెలుగుదేశం, జనసేన పార్టీల్లోనూ అంటిపెట్టుకుని పార్టీ బలోపేతానికి పాటుపడ్డ నియోజకవర్గ నాయకత్వం ఇప్పుడు అధిష్ఠానం నిర్ణయం కోసం ఎదురుచూస్తోంది. వాస్తవానికి రాష్ట్ర స్థాయి పదవుల్లో జిల్లాకు ప్రాధాన్యం లభించింది. నలుగురు ఎమ్మెల్యేలకు పదవులు వరించాయి. మంత్రిగా నిమ్మల, డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణరాజు, ప్రభుత్వ విప్‌లుగా బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్‌లను ప్రభుత్వం నియమించింది. మరో నాలుగు కార్పొరేషన్‌ల పగ్గాలను జిల్లా నాయకులకు అప్పగించింది. ఏపీఐఐసీ చైర్మన్‌గా మంతెన రామరాజు, కాపు కార్పొరేషన్‌కు కొత్తపల్లి సుబ్బారాయుడు, క్షత్రియ కార్పొరేషన్‌కు కనకరాజుసూరి, ఎస్సీ కార్పొరేషన్‌కు పీతల సుజాతలను చైర్మన్‌లుగా ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖకు సలహాదారుగా కేబినెట్ హోదాలో షరీఫ్‌కు బాధ్యతలు అప్పగించారు.

ఇన్‌చార్జిల ఎదురుచూపు

నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఇప్పుడు అధిష్ఠాన నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా తెలుగుదేశంలో ఒకింత అసంతృప్తి నెలకొంది. నామినేటెడ్ పదవులు ఆశించిన నాయకుల్లో అయోమయం నెలకొంది. తెలుగుదేశం ఇన్‌చార్జిలు తోట సీతారామలక్ష్మి, వలవల బాబ్జి, పొత్తూరి రామరాజులు అధిష్ఠానం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా తాడేపల్లిగూడెం విషయంలో ఎన్నికల ముందు, అనంతరం చంద్రబాబు గట్టి హామీనే ఇచ్చారు. దానికోసం నియోకవర్గ కేడర్ అంతా ఎదురుచూస్తోంది. తాడేపల్లిగూడెంలో గడచిన 20 ఏళ్లనుంచి తెలుగుదేశం అధికారంలో లేదు. అదే ఇప్పుడు కేడర్‌ను అయోమయంలోకి నెడుతోంది. ఇప్పటిదాకా కార్పొరేషన్ పదవుల్లో రెండు పార్టీలకు పెద్దగా ఫలితం దక్కలేదు.

డైరెక్టర్‌ల నియామకంలోనూ అసంతృప్తి

డైరెక్టర్‌ల కోటాలోనూ తెలుగుదేశానికి ఒక్కటి, జనసేనకు ఒక్కటి మాత్రమే తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి కేటాయించారు. ముఖ్యంగా తెలుగుదేశం నియోజకవర్గ నాయకత్వం దీనిపై తీవ్ర అసంతృప్తికి లోనైంది. నర్సాపురంలో రెండు పదవులు ముఖ్య నాయకులను వరించాయి. తెలుగుదేశం పార్టీకి అక్కడ కూడా పదవులు వరించలేదు. భీమవరంలోనూ అదే పరిస్థితి. తోట సీతారామలక్ష్మి నామినేటెడ్ పదవిని ఆశిస్తున్నారు. ఇతర నాయకులు ముందు వరుసలో ఉన్నారు. పలు నియోజకవర్గాలకు పరిశీలకులుగా వెళ్లిన కోళ్ల నాగేశ్వరరావు కూడా ప్రయత్నాలు ముమ్మరంగానే సాగించారు. తాడేపల్లిగూడెంలో గొర్రెల శ్రీధర్ సైతం ఇతర నియోజకవర్గాలకు పరిశీలకునిగా వ్యవహరించారు. వీరితోపాటు కీలక నాయకులు సైతం జిల్లా పదవులను ఆశిస్తున్నారు. అధిష్ఠానం మాత్రం చెప్పిన విధంగా న్యాయం చేయలేకపోతోందన్న ఆవేదన కేడర్‌లో నెలకొంది. ఆ ప్రభావం తెలుగుదేశం సభ్యత్వంపై పడుతోంది. కేడర్‌నుంచి సహాయ నిరాకరణ ఎదురవుతోంది. సభ్యత్వ నమోదు కోసం ఇన్‌చార్జిలు మల్లగుల్లాలు పడుతున్నారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి ఆపసోపాలు పడుతున్నారు. స్థానిక పరిస్థితులను, కేడర్‌లో అసంతృప్తికి గల కారణాలను అధినాయకత్వం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారు. డైరెక్టర్‌ల పదవులు విషయంలోనూ జిల్లాలో కొన్ని నియోజకవర్గాలకే ప్రాతినిధ్యం లభించింది. డైరెక్టర్ పదవులు పొందిన వారిలోనూ ఒకటి రెండు చోట్ల అసంతృప్తి ఉంది. ఇప్పటిదాకా ప్రభుత్వం నియమించిన కార్పొరేషన్ డైరెక్టర్‌లలో ఉండి నియోజకవర్గానికి అధిక పదవులు వరించాయి. అట్టడుగన తాడేపల్లిగూడెం ఉంది. తెలుగుదేశం, జనసేన పార్టీకి ఒక్కో డైరెక్టర్ పదవిని మాత్రమే ఇచ్చారు. నియోకజవర్గంలో ఇది పెద్ద చర్చగా మారింది. నర్సాపురంలో తెలుగుదేశం నాయకత్వం నలుగుతోంది.

జారి పోతున్నారు..



» రైలు ప్రమాదాల్లో మరణిస్తున్న ప్రయాణికులు

» అజాగ్రత్తే ప్రమాదాలకు కారణం

» గత రెండేళ్లలో 150 మందికిపైగా మృతి

» ఆచూకీ తెలియని వారెందరో..

» అనాథలుగానే అంత్యక్రియలు

7



నిట్ పరిపాలనా భవనం

ఏపీ నిట్‌కు మంచిరోజులు

» ఫ్యాకల్టీ నియామకం » నిధులు మంజూరుకు ప్రతిపాదనలు

తాడేపల్లిగూడెంలో ఆంధ్రప్రదేశ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ (ఏపీనిట్)కి మంచి రోజులు వస్తున్నాయి. రెగ్యులర్ ఫ్యాకల్టీ నియామకానికి చర్యలు తీసుకున్నారు. ఇదివరకే నోటిఫికేషన్ విడుదల చేశారు. త్వరలో భర్తీ చేయనున్నారు. దీనివల్ల బోధన సిబ్బంది సంఖ్య పెరగనుంది. తద్వారా మళ్లీ ఏపీనిట్‌లో సీట్ల సంఖ్య 750కి పెరగనుంది. బోధన సిబ్బంది కొరత వల్ల గడచిన రెండేళ్ల నుంచి 750 సీట్లకు బదులుగా 480 సీట్లకే అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి యథాతథంగా 750 మంది విద్యార్థులకు అడ్మిషన్‌లు కల్పిస్తారు. మరోవైపు 25 ఎకరాల అదనపు భూమిని ఏపీనిట్‌కు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. వాస్తవానికి 40 ఎకరాలు కావాలని ఏపీనిట్ ప్రతిపాదించింది. ప్రస్తుతం 26 ఎకరాల భూమి ఇచ్చేలా చర్యలు సాగుతున్నాయి. ఏపీనిట్ అభివృద్ధికి రూ. 500 కోట్లు నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కేంద్ర ఆర్థిక శాఖ వద్ద ఆమోదం లభిస్తే నిధులు మంజూరవుతాయి. ఈ నిధులతో అకడమిక్ భవనాలు, ఫ్యాకల్టీ భవనాలు, ల్యాబ్‌లు, హాస్టల్స్ నిర్మిస్తారు.

ఏసీ తరగతి గదులు

విద్యార్థులకు ఏసీ తరగతి గదులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి తరగతి గదిలోనూ ఏసీ సమకూరుస్తున్నారు. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. ఈ వేసవి నాటికి ఏసీ సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. మరోవైపు నిట్ డైరెక్టర్ పదవి భర్తీ కోసం కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నోటిఫికేషన్ విడుదల చేసింది. రానున్న మూడు నెలల్లో రెగ్యులర్ డైరెక్టర్ వచ్చే అవకాశా లున్నాయి. అప్పటిదాకా నాగపూర్ నిట్ డైరెక్టర్ రమణా రావు ఏపీనిట్‌కు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. గత ఏడాది ఉద్యోగాల విషయంలో ఎన్నో ఆటుపోట్లు ఎదురయ్యాయి. అయినా సరే నిట్‌లో ప్లేస్‌మెంట్స్ ఆశాజనకంగా ఉన్నాయి. అత్యధికంగా రూ.44 లక్షల ప్యాకేజీతో విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం లోనే ఏపీ నిట్ ఏర్పాటయ్యింది. మళ్లీ అదే ప్రభుత్వంలో ఇప్పుడు అభివృద్ధికి నోచుకోనుంది.



సీవీ రామన్ ల్యాబ్



మంత్రి రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్‌లు

పాలకొల్లులో వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్‌లు

పాలకొల్లు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆదివారం ఆ పార్టీకి చెందిన పలువురు సర్పంచులు వైసీపీ కి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వీరికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ టీడీపీ కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. పాలకొల్లు మండలానికి చెందిన దిగమర్రు, కొత్తపేట, గోరింటాడ, ఆగ ర్రు, వెలివెల, వాలమర్రు, శివదేవుని చిక్కాల, చందపర్రు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు రాపాక నగేష్ కరుణాకర్, కవురు భారతి, మండెల పావని, సాకా గంగారత్నం, కందుల వెంకటేశ్వరరావు, గంటా సత్యనారాయణ, దిడ్ల మణివజ్రం, కొయ్యే అచ్చియ్య వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరా రు. ఎన్డీయే ప్రభుత్వం పంచాయతీల ఆర్థిక పరిపుష్టిని పెంచి సర్పంచ్‌ల గౌరవాన్ని పెంచిందని దీంతో టీడీపీలో చేరామని రాజీనామా చేసిన సర్పంచ్‌లు తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్లొచ్చేలోగా.. దోచేశారు

» చెక్కపల్లిలో భారీ చోరీ

» రూ.65 లక్షల బంగారం, వెండి..

» రూ.4 లక్షల నగదు అపహరణ



ముసునూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లిలో శనివారం రాత్రి ఒక ఇంటిలో భారీ చోరీ జరిగింది. ఈ చోరీలో నగదు, బంగారు అభరణాలు, వెండి వస్తువులను అపహరణకు గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన మందలపు రాధాకృష్ణ ఈ నెల 14వ తేదీన కుటుంబ సమేతంగా పెద్ద తిరుపతి వెళ్లారు. ఈ క్రమం లో ఆదివారం ఉదయం పనిమనిషి వాకిలి ఊడ్చేందుకు రాగా, ఇంటి ఇంటి తలుపులు తెరచి ఉండటం చూసి, సమీప నివాసితులను పిలవడంతో వారు వచ్చి చూడగా తలుపులకు వేసిన లాక్ పగులకొట్టి ఉంది. దీంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి తిరుగు ప్రయాణంలో ఏలూరుకు చేరు కున్న ఇంటి యజమాని రాధా కృష్ణకు ఫోన్ ద్వారా సమా చారం ఇచ్చారు. దీంతో అతను హుటాహుటీన ఉదయం 9గంటల కల్లా ఇంటికి చేరు కుని, ముసునూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నూజి వీడు రూరల్ సీఐ రామకృష్ణ, ముసునూరు ఎస్ఐ ఎం.చిరం జీవి, చాట్రాయి ఎస్ఐ డి.రామకృష్ణ ఘటనా స్థలిని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూజ్ టీమ్‌లను రప్పించి అధారాలను సేకరించారు. రాత్రి నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి ప్రసాద్ కూడా చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యుల నుంచి వివరాలు ఆడిగితెలుసుకుని నమోదు చేశారు. ఈ చోరీలో రూ.62 లక్షల 50 వేలు విలువగల 104 కాసుల బంగారు అభరణాలు, రూ.2లక్షల 50 వేలు విలువ గల రెండున్నర కేజీల వెండి వస్తువులు, రూ.4లక్షలు నగదు అపహరించుకు పోయిన్నట్టు బాధితుడు రాధాకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్టు సీఐ రామకృష్ణ తెలిపారు.

ఆంధ్రజ్యోతి

నవ్య

కుటుంబ కదంబం

సోమవారం ● 18 నవంబరు 2024



హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. భూల్ భులాయా (భూల్ భులాయా3)
3. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
4. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
5. జా రాంఝున్ (దో పత్తీ)
6. ఆయీ నై (స్త్రీ-2)
7. సాజ్‌నీ రే (లా పతా లేడీస్)
8. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
9. అపనా బనాలే (భేడియా)
10. మిలియనీర్ (గ్లోరీ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్ : చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

సెలబ్ టాక్

దేనికైనా రెడీ..!



బాలీవుడ్‌లోకి మరో వారసురాలు వచ్చింది.
ఆమె ఎవరో కాదు... హీరో వరుణ్ ధావన్ అన్న కూతురు...
'బిన్ని అండ్ ఫ్యామిలీ' కథానాయిక... అంజినీ ధావన్.
వెండితెరపై వెలిగిపోవాలన్న ఆశయంతో... కొన్నేళ్లు
పరిశ్రమలోనే పని చేసి... అనుభవం గడించింది.
తొలి చిత్రంతోనే మంచి హిట్ సొంతం చేసుకోవడమే కాదు...
అగ్ర నటుల ప్రశంసలు కూడా అందుకుంది.

అంజినీ ఇంట్లో అందరూ సినీ పరిశ్రమతో అనుబంధం ఉన్నవారే. తాతయ్య అనిల్ ధావన్ వెటరన్ నటుడు. ఆయన కుమారుడు, అంజినీ తండ్రి సిద్ధార్థ్ ధావన్ బుల్లితెర నటుడు. హిట్ చిత్రాల దర్శకుడు డేవిడ్ ధావన్ పినతాత. డేవిడ్ తనయుడు, ప్రముఖ హీరో వరుణ్ ధావన్ ఆమెకు వరుసకు బాబాయి. చిన్నప్పటి నుంచీ సినీ వాతావరణంలోనే గడిపిన అంజినీకి సాధారణంగానే నటనపై మక్కువ పెరుగుతూ వచ్చింది. ముంబయిలో పుట్టి పెరిగిన ఆమె... డిగ్రీ తరువాత కెరీర్‌పై పూర్తి శ్రద్ధ పెట్టింది. అయితే కుటుంబ నేపథ్యం, ఇంట్లోవాళ్ల ప్రోత్సాహం ఉన్నా... తొలుత తనను తాను పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలని అనుకుంది. ఆ తరువాతే తెర మీద కనిపించాలనే పట్టుదలతో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పరిశ్రమలో అడుగుపెట్టింది. వరుణ్ ధావన్ 'కూలీ నంబర్-1'కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసింది. అప్పుడప్పుడూ బామ్మ రష్మీ ధావన్ యాక్టింగ్ స్కూల్లోని విద్యార్థులతో కలిసి నటనలో మెళకువలు కూడా నేర్చుకుంది. ఇలా ఎక్కడ అవకాశం దొరికినా దాన్ని ఉపయోగించుకొంటూ... తనలోని నటికి మరిన్ని వన్నెలద్దింది. వీటన్నిటి ఫలితం తొలి చిత్రం 'బిన్ని అండ్ ఫ్యామిలీ'లోనే కనిపించింది. సినిమా చూసినవారందరూ... ఆమెకు అది మొదటి సినిమా అనుకోలేదట. అంతలా అదరగొట్టింది నటనలో. ఇక ఎంతో సహజంగా నటించిందనేది విమర్శకుల మాట.

వేరొక ఆడిషన్‌లో చూసి...

'బిన్ని అండ్ ఫ్యామిలీ'లో అవకాశం కూడా విచిత్రంగా వచ్చింది అంజినీకి. "వేరొక సినిమా కోసం ఏడాదిగా ఆడిషన్లు ఇస్తున్నా. అది సంజయ్ త్రిపాఠీ దృష్టిలో పడింది. తను తీయబోయే చిత్రంలో 'బిన్ని' పాత్రకు నేనైతే సరిగ్గా సరిపోతానని ఆయన భావించారట. వెంటనే నన్ను ఆడిషన్స్‌కు పిలిచారు. నా నటన నచ్చింది. అలా 'బిన్ని అండ్ ఫ్యామిలీ'లో అవకాశం రావడమే కాదు... నటిగా నా కెరీర్ కూడా ప్రారంభమైంది" అంటూ ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది అంజినీ.



'నా జీవితానికి దగ్గరైన పాత్ర'...

ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలను లండన్‌లో చిత్రీకరించాడు సంజయ్. నెల రోజులపాటు సాగిన ఆ షెడ్యూల్‌లో 'పంకజ్ కపూర్, హిమని శివ్‌పురి, రాజేష్‌కుమార్ లాంటి సీనియర్లతో కలిసి పని చేయడంవల్ల ఎంతో నేర్చుకొనే అవకాశం లభించింది. అంతా ఒక కుటుంబ సభ్యుల్లా కలిసిపోయారు. నెల రోజులూ ఎంతో సరదాగా గడిచిపోయాయి. అదీకాకుండా 'బిన్ని' పాత్ర నిజ జీవితంలో నాకు చాలా దగ్గరగా ఉంటుంది. కొన్ని సన్నివేశాలు చేస్తున్నప్పుడు, ముఖ్యంగా బామ్మ పాత్రధారి నా చిరిగినట్లుండే ఫ్యాషన్ జీన్స్ చూసి ఇదేంటని ప్రశ్నించినప్పుడు మా నాన్న గుర్తుకువచ్చారు. ఆయన కూడా ఇంట్లో నా డ్రెస్‌లు చూసి జోకులు వేసేవారు' అంటూ తన అనుభవాలు పంచుకుంది అంజినీ. డేవిడ్, వరుణ్ ధావన్ ఎప్పుడూ ఆమెకు అండగా ఉంటారు. ముఖ్యంగా ఈ చిత్రం ప్రచార కార్యక్రమాల్లోనే కాకుండా, షూటింగ్ సమయంలో కూడా వరుణ్ అంజినీకి మద్దతుగా నిలిచాడు. తన ఇన్‌స్టా, ఎక్స్ ఖాతాల్లో ఆమె గురించి, ఆమె చిత్రం గురించిన విశేషాలను పంచుకున్నాడు. సినిమా విడుదల తరువాత కూడా అంజినీని ప్రత్యేకంగా అభినందించాడు.

నిరూపించుకొంటేనే...

"నా సినిమా విడుదలకు ముందు కొందరు 'బాలీవుడ్‌లో బంధుప్రీతికి మరో నిదర్శనం' అంటూ కించపరిచేలా నాపై వ్యాఖ్యలు చేశారు. పరిశ్రమలో పరిచయాలవల్ల కష్టపడకుండానే మొదట్లో ఒకటి రెండు అవకాశాలు వస్తాయేమో! కానీ మనలో సామర్థ్యం లేకపోతే ఇక్కడే కాదు, ఏ రంగంలోనూ నిలదొక్కుకోలేము. మనల్ని మనం నిరూపించుకొంటేనే మనుగడ. నటిగా తెరమీద కనిపించడానికి ముందు సినీ నిర్మాణంలో ప్రతి క్రాఫ్ట్ గురించీ తెలుసుకోవాలని అనుకున్నాను. అందుకే తొలుత బాబాయి సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. షూటింగ్ స్పాట్‌కు ఉదయాన్నే వెళ్లిపోయేదాన్ని. కెమెరా, లైటింగ్, లొకేషన్లు... ఇలా అన్నిటి మీద ఒక అవగాహన వచ్చాకనే నటన గురించి ఆలోచించాను" అంటుంది అంజినీ.

మంచి స్నేహితులు...

'కూలీ నంబర్-1' షూటింగ్‌లో వరుణ్, ఆ చిత్ర కథానాయిక సారా అలీఖాన్‌తో ఎంతో సరదాగా గడిచిపోయేదని, తారలపై వచ్చే గాసిప్స్ మీద మాట్లాడుకొని నవ్వుకొనేవారమని చెప్పింది ఇరవై నాలుగేళ్ల అంజినీ. 'వరుణ్‌ను ఎప్పుడూ బాబాయిగా చూడలేదు. అన్నయ్యలాగా భావిస్తాను. తను నన్ను ఎంతో గారాబంగా చూసుకొంటాడు' అంటున్న అంజినీకి సంజయ్ కపూర్ కుమార్తె, నటి షనయ కపూర్, బోనీ- శ్రీదేవిల చిన్న కూతురు ఖుషీ కపూర్ మంచి మిత్రులు. 'నా సినిమా ప్రీవ్యూ నుంచి బయటకు వచ్చేటప్పుడు వాళ్ల కళ్లు చమర్చాయి. నా నటన బాగుందని అభినందించారు' అంటూ తన ఆనందాన్ని పంచుకుంది అంజినీ.

అన్నీ చెయ్యాలి...

మొదటి చిత్రంతోనే మంచి నటిగా ప్రశంసలు అందుకున్న అంజినీ... భవిష్యత్తులో అన్ని రకాల పాత్రలూ చేయాలని అనుకొంటోంది. 'యాక్షన్, కామెడీ, ప్రేమ కథలు, సై థ్రిల్లర్లు అనే తేడా లేకుండా ప్రతి పాత్రా పోషించాలి. విలక్షణ నటిగా ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలి'... అని కోరుకొంటున్న అంజినీ ఏ పాత్రకైనా రెడీ అంటోంది. ఆమెకు ఇన్‌స్టాలో ఫాలోవర్స్ కూడా తక్కువేంలేరు. ఫ్యాషన్ ఐకాన్‌గా తెరంగేట్రానికి ముందే లక్షలమంది అభిమానులను సంపాదించుకున్న ఆమె... తరచూ వెరైటీ డ్రెస్సుల్లో ఫొటోలు అప్‌లోడ్ చేస్తుంటుంది. వాటికి లైక్‌లూ లక్షల్లోనే. ఫిట్‌గా ఉండటానికి యోగా, జిమ్నాస్టిక్స్‌ను తన దినచర్యల్లో భాగంగా చేసుకుంది.

నవ్య | చిత్రజ్యోతి

ఆ స్వేచ్ఛ మాకూ ఉంది

- విష్వక్‌సేన్


'ఒక సినిమా బాగోగుల గురించి విమర్శకులు, సమీక్షకులు ఎంతటి విశ్లేషణ అయినా చేయవచ్చు కానీ ఆ వంకతో వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా ఉండకూడదు. మీలాగా మాకూ భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందని గుర్తుంచుకోవాలి' అని హీరో విష్వక్‌సేన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ కథా



నాయికలు. రామ్ తాళ్లూరి నిర్మాత. ఈ నెల 22న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం వరంగల్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. విష్వక్‌సేన్ మాట్లాడుతూ "మెకానిక్ రాకీతో మా నిర్మాత రామ్ గర్వపడేలా చేస్తా. పది సినిమాల అనుభవంతో చెబుతున్నా మంచి సినిమా తీశాం. ఐదు నిమిషాలు కూడా బోర్‌కొట్టదు. మా సినిమాను ఆదరించండి' అని ప్రేక్షకులను కోరారు. రామ్ తాళ్లూరి మాట్లాడుతూ 'విష్వక్‌సేన్ కష్టపడి, ఇష్టపడి చేసిన సినిమా ఇది. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలున్నాయి. మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. యువతను, మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో తెరకెక్కిన చిత్రమిదని మీనాక్షి చౌదరి తెలిపారు. సందేశం, వినోదం కలబోతగా రూపొందిన చిత్రమిదని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పారు.

కొత్తగా...

రిమాండ్‌కు కస్తూరి




తమిళ నాడులో నివసిస్తున్న తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో నటి కస్తూరికి ఎగ్మోర్ మెట్రోపాలిటన్ కోర్టు 12 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆమెను పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. 'అధికార దుర్వినియోగాన్ని ముగింపు పలికి న్యాయాన్ని గెలిపించాల'ని కోర్టు వెలుపల కస్తూరి మీడియాతో అన్నారు. మధురై కోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో హైదరాబాద్‌లో తలదాచుకున్న కస్తూరిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకొని తమిళనాడుకు తరలించిన విషయం తెలిసిందే.



పట్నాలో పుష్ప రూల్

'నేను మొదటిసారి బిహార్‌కు వచ్చాను. నా హిందీ అంత బావుండదు. తప్పులు మాట్లాడితే క్షమించండి. ఎవరికీ తలవంచని పుష్ప నేడు మీ ముందు తలవంచుతున్నాడు. మీ అభిమానమే 'పుష్ప 2: ది రూల్' లాంటి మంచి చిత్రాన్ని తీయడానికి మాకు ప్రేరణ' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పుష్ప 2'. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని బిహార్ రాజధాని పట్నాలో భారీ జనసందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ "పుష్ప' చిత్రాన్ని పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఆ సినిమా సూపర్‌హిట్ అయ్యిందంటే ఆ గొప్పదనం నాది కాదు, ప్రేక్షకులదే. మీ ప్రేమే 'పుష్ప 2: ది రూల్' చిత్రాన్ని ఇంత గొప్పగా తీయడానికి కారణమైంది. డిసెంబర్ 5న మీ ముందుకు రాబోతోంది. తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది. మీ సమక్షంలో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను' అని చెప్పారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'ఇంతమంది అభిమానులు 'పుష్ప' ప్రపంచంలోకి వచ్చినందుకు నాకు సంతోషంగా ఉంది. రెండు సంవత్సరాలుగా అభిమానులు ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. మీ అందరి అంచనాలకు మించి సినిమా ఉండబోతోంది' అని తెలిపారు. 'పట్నా ప్రజల నుంచి ఈ స్థాయి ఆదరణను ఊహించలేదు. ఈ గొప్పదనం అల్లు అర్జున్, సుకుమార్‌కు దక్కుతుంది' అని నిర్మాత యలమంచిలి రవి, నవీన్ యెర్నేని తెలిపారు. 'పుష్ప 2' చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం భారీ ఎన్నికల ప్రచార సభను తలపించింది. దేశవ్యాప్తంగా ఉన్న అల్లు అర్జున్ అభిమానులు తరలివచ్చారు. గాంధీ మైదానం జనాలతో కిటకిటలాడిపోయింది. ఈ కార్యక్రమానికి సుమారు రెండు లక్షలమంది హాజరయ్యారని అంచనా. "పుష్ప అంటే ఫైర్ కాదు వైల్డ్ ఫైర్' అంటూ ఆయన చెప్పిన డైలాగ్‌లకు అభిమానుల కేరింతలతో సభాప్రాంగణం మార్మోగింది. బిహార్ డిప్యూటీ సీఎం విజయ్ సేన సాహెబ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పశుపాలకుడిగా ప్రణవ్



వెండితెరపైన సాదా సీదా పాత్రలను అద్భుతంగా పోషించే తారలు నిజ జీవితంలో అలా జీవించగలరా? అంటే 'కష్టమే' అని చెప్పాలి. కానీ మలయాళ మెగా స్టార్ మోహన్‌లాల్ కొడుకు ప్రణవ్ మాత్రం స్టార్‌డమ్‌ను పక్కన పెట్టి దేశం కాని దేశంలో అనామకంగా జీవిస్తున్నాడు. ప్రస్తుతం స్పెయిన్‌లో 'వర్క్ అవే' అనే కార్యక్రమంలో భాగంగా ఆయన ఓ పొలంలో కష్టపడి పనిచేస్తున్నారు. పశుపాలకుడిగా గొర్రెలు, మేకలు, గుర్రాలను కాస్తున్నారు ప్రణవ్. నటుడిగా పోషించాల్సిన విభిన్న పాత్రల్ని తన కొడుకు నిజజీవితంలో పోషిస్తున్నారని ప్రణవ్ తల్లి సుచిత్ర ఓ ఇంటర్వ్యూలో చెప్పడంతో ఈ విషయం అందరికీ తెలిసింది. ఒక సూపర్‌స్టార్‌కి కొడుకు, ఆగర్భ శ్రీమంతుడు అయినా విలాసవంతమైన జీవన శైలిని వదిలి ఇలా సాదాసీదాగా గడుపుతున్న ప్రణవ్‌ను నెటిజన్లు అభినందిస్తున్నారు. 2002లో 'ఒన్నమన్' అనే సినిమాతో బాలనటుడిగా అరంగేట్రం చేసిన ప్రణవ్.. 'పునర్జనీ' చిత్రంతో ఉత్తమ బాలనటుడిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డు అందుకున్నారు. 2018లో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో 'ఆది' అనే చిత్రంతో హీరోగా పరిచయమయ్యారు. ఈ సినిమా ఆ ఏడాది అత్యధిక వసూళ్లు అందుకున్న చిత్రంగా నిలవడమే కాకుండా ప్రణవ్‌కు ఉత్తమ నటుడిగా సైమా అవార్డునూ తెచ్చిపెట్టింది. ప్రణవ్ కేవలం నటుడిగానే కాకుండా ప్లేబ్యాక్ సింగర్‌గా, పాటల రచయితగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు.

గాయకుడు అనురాగ్ కులకర్ణి, గాయని రమ్య బెహర వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ వేడుకకి సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరలవుతున్నాయి. కొద్దిమంది కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్.కీరవాణి చిన్న కుమారుడు శ్రీ సింహా, సీనియర్ నటుడు మురళీ మోహన్ మనవరాలు రాగ వివాహం త్వరలోనే జరగనుంది. ఆదివారం గోల్కొండ రిసార్ట్స్‌లో ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ వేడుకలో ఆంధ్రజ్యోతి గ్రూప్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సహా పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.



రూ. పదికోట్ల వీడియో ఫ్రీగా చూడండి



నటి నయనతార బయోపిక్‌గా నెట్‌ఫ్లిక్స్ తెరకెక్కించిన డాక్యుమెంటరీ 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్'. దీనికోసం 'నానుమ్ రౌడీ దాన్' సినిమా సమయంలో షూట్ చేసిన మూడు సెకన్ల క్లిప్‌ను వాడుకున్నందుకు రూ.పది కోట్లు ఇవ్వాలని నటుడు, నిర్మాత ధనుష్ కోరారని.. ఇందుకు ఆయనని విమర్శిస్తూ నయనతార ఓ బహిరంగ లేఖ రాసిన సంగతి తెలిసిందే. అయితే నయనతారను సపోర్ట్ చేస్తూ ఆదివారం ఆమె భర్త విఘ్నేష్ శివన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రెండు పోస్టులు పెట్టారు. అందులో ఒక దాంట్లో.."కేవలం మూడు సెకన్లకు ధనుశ్ రూ.పది కోట్లు డిమాండ్ చేసిన వీడియో ఇదే. మీరంతా ఫ్రీగా చూసేయ్యండి" అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. అంతటితో ఆగకుండా... మరో పోస్ట్‌లో.. 2017లో 'సక్క పొడు పొడు రాజా' సినిమా ఆడియో ఫంక్షన్‌లో ధనుశ్ మాట్లాడిన వీడియోను కూడా షేర్ చేశారు. అందులో ప్రేమను పంచడం గురించి.. నటీనటులు పనిచేసే చోట ఉండాల్సిన వాతావరణం గురించి ధనుశ్ మాట్లాడారు. ఆ వీడియోకి కౌంటర్‌గా "జీవించండి.. ఇతరులని స్వేచ్ఛగా జీవించనివ్వండి. ప్రేమను పంచండి.. ఓం నమః శివాయ. మీరు చెప్పినవి ముందు మీరు పాటించండి. కనీసం మీ అభిమానుల కోసమైనా" అని పేర్కొన్నారు. అయితే ఈ పోస్టులను కొద్దిసేపటికే విఘ్నేష్ శివన్ తొలగించడం గమనార్హం. మరోవైపు గాయని సుచిత్ర, ధనుశ్ ఎంతో మంది హీరోయిన్లను వేధించారని ఆరోపించారు.



గట్టుపైగల బౌద్ధ ఆరామాలు.. పాలరాతితో నిర్మించిన బౌద్ధ స్థూపం

బౌద్ధారామాలను పరిరక్షించాలి

జీలకర్రగూడెంలో నేడు గట్టు తీర్థం

కామవరపుకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బౌద్ధ చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న బౌద్ధారామాలను పరిరక్షించకపోతే భవిష్యత్తులో అవి కాల గర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉందని పర్యాటకులు, పరిశోధకులు పేర్కొం టున్నారు. కామవరపుకోట మండలం జీలకర్రగూడెం వద్ద ఉన్న బౌద్ధారామాలను అభి వృద్ధి చేస్తే ఆ ప్రాంతమంతా పర్యాటక కేంద్రంగా మారుతుందని, తద్వారా జిల్లా అభివృద్ధికి దోహదపడుతుందని పలువురు పేర్కొంటున్నారు. పచ్చని చెట్లు, కొండపై ఏక శిలా నిర్మితమైన ధర్మలింగేశ్వరస్వామి పెద్ద బౌద్ధలింగం, పర్యాటకులను ఆకట్టుకుంటాయి. బౌద్ధుల చైత్యాలు, గుహలు, ప్రాచీన కట్టడాలు, పాలరాతి బౌద్ధ స్థూపాలు ఉన్నాయి. ధర్మలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ కార్తీకమాసంలో ప్రతీ సోమవారం మహిళలు దీక్ష చేస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందనే నమ్మకం ప్రజల్లో నెలకొంది. దీంతో కార్తీకమాసంలోని సోమవారం ధర్మలింగేశ్వరస్వామి సన్నిధిలో మహిళలు తలార చన్నీటి స్నానం సాష్టాంగ ప్రణామాలు చేస్తారు. ఈ తరుణంలో ధర్మలింగేశ్వరస్వామి దీక్ష చేసే వారికి కనపడతారని, అనంతరం దీక్షను విరమిస్తారని, తదుపరి వారికి సంతాన ప్రాప్తి కూడా కలుగుతుందనే నమ్మకం ప్రజల్లో ఉంది. ఈప్రాంతానికి రాకపోకలు సాగించేందుకు సరైన రహదారి లేదు. పాలకులు, అధికారులు దృష్టిపెట్టి ఈ బౌద్ధారామాలను పరిరక్షించి అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



అనుగ్రహభాషణం చేస్తున్న స్వామీజీ విరజానంద.. హాజరైన కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే అంజిబాబు

సంపదే కాదు.. సంస్కారమూ అందించాలి

విరజానంద స్వామీజీ.. భీమవరంలో హిందూ వన విహార్

భీమవరం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ సంపద సృష్టి స్తున్నారు..కానీ తమవారికి సంస్కారం మాత్రం అందించలేకపోతున్నారని కడప జిల్లా అచలానంద ఆశ్రమం తోటపల్లి బ్రహ్మంగారిపీఠం స్వామీజీ విరజా నంద స్వామిజీ అన్నారు. కార్తీకమాసం సందర్భంగా ప్రకృతి ఆశ్రమంలో హిందూ వనవిహార్ పేరుతో నిర్వహించిన కార్తీక వన సమారాధనలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్తీక వన సమారాధనలు మన ఐక్యత, శక్తి తెలియచె య్యటానికి, మన సంస్కృతీ, సంప్రదాయాలు కనుమరుగు కాకుండా ఉండేం దుకు దోహదపడతాయని తెలిపారు. మన పిల్లలకు సంపదతో పాటు సంస్కారం కూడా అందించాల్సిన అవసరం ఉందన్నారు. నేడు మహిళలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. మహిళా రక్షణకు ప్రతీ ఒక్కరూ కంకణం కట్టు కోవాలన్నారు. ఇప్పుడు చాలామంది అనేక రకాల మాలధారణలు చేస్తున్నారు. ఆ సమయంలో వంటి నిండా విభూతి , బొట్లు పెట్టుకుంటున్నారు.. ఇది చాలా మంచిదే..కానీ మాల తీసివేసిన తరువాత ఎంతమంది నుదుటన బొట్టుపెట్టు కుంటున్నారని ప్రశ్నించారు. నుదుటన బొట్టు ధర్మాన్ని రక్షించటం కోసమన్నారు. ఆర్ఎస్ఎస్ సహక్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్ మాట్లాడుతూ మన పిల్లలకు మన సంప్రదాయాలు నేర్పించాలన్నారు. ముందుగా కార్తీక దామోదర పూజ నిర్వహించారు. కాటికాపరికి, పాదరక్షలు కుట్టే వ్యక్తి, దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న దళిత అర్చకుడికి సత్కారం చేశారు. వేలాది మంది హిందువుల బంధువులు తరలివచ్చారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మె ల్యేలు పులపర్తి రామాంజనేయులు,కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, సుబాష్, కార్యక్రమం కన్వీనర్ మంతెన రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.



వన విహార్‌లో కేరళ సంప్రదాయ డప్పులతో నృత్యాలు

చిన వెంకన్నకు సర్వభూపాల వాహనం బహూకరణ



ద్వారకాతిరుమల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తణుకుకు చెందిన మల్లె తిరు మల వెంకటరమణ, వరలక్ష్మిదేవి దంపతులు 120 కేజీల టేకు చెక్కతో కూడిన ఇత్తడి సర్వభూపాల వాహనాన్ని ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆల యంలో అందజేశారు. దీనిని స్వామివారి సేవలకు వినియోగించాలని దాత కోరి నట్లు ఈవో ఎన్వీ సత్యన్నా రాయణ మూర్తి తెలిపారు.

మావుళ్ళమ్మ ఆలయం వద్ద సామూహిక కుంకుమార్చనలు



భీమవరం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ దేవ స్థానం ఆధ్వర్యంలో ఆదివారం మావు ళ్ళమ్మ దీక్షను స్వీక రించిన 401 మంది వ నా లదా రు ల చే సామూహిక కుంకుమార్చనలు చేయించారు.ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, అమ్మవారి ఆవాహన, కార్యక్ర మాలు నిర్వహించిన అనంతరం కుంకుమపూజలు చేయించారు.

దూరం ప్రయాణించాలన్నా, సురక్షితంగా గమ్యం చేరాలన్నా ఎక్కువ శాతం మంది రైలు ప్రయాణానికే ప్రాధాన్యం ఇస్తుంటారు. అయితే కొంతమంది నిర్లక్ష్యం, అజాగ్రత్త కారణంగా రైలు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. దిక్కులేని చావు చస్తున్నారు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైలు ప్రమాదాల్లో ఈ రెండేళ్లలో 150 మందికి పైగా చని పోయారు.. వీరిలో సగం మందికి పైగా ఆచూకీ తెలియలేదు.. అనాథలుగానే వెళ్లిపోయారు... కాస్త అప్రమత్తంగా ఉంటే జీవితాలు బలికావు..



జారి పోతున్నారు..



రైలు ప్రమాదాల్లో మరణిస్తున్న ప్రయాణికులు

- అజాగ్రత్తే ప్రమాదాలకు కారణం
- గత రెండేళ్లలో 150 మందికిపైగా మృతి
- ఆచూకీ తెలియని వారెందరో..
- అనాథలుగానే అంత్యక్రియలు

భీమవరం క్రైం/ ఏలూరు క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులు రద్దీని దృష్టిలో పెట్టుకుని రైల్వే శాఖ రైళ్లను ఏర్పాటు చేస్తున్నప్పటికీ ఇంకా జనరల్ బోగీల్లో ప్రయాణించేవారు ఎక్కువ మంది ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు గాలిలోకి కలిసిపోతున్నాయి. ఎక్కువ మంది వలస కార్మికులు సాధారణంగా జనరల్ బోగీల్లోనే సుదీర్ఘ ప్రయాణం కొనసాగిస్తారు. ఎక్కువశాతం చెన్నై నుంచి అసోం, ఒడిశా, పశ్చిమ బెంగాల్ ఆయా ప్రాంతాల నుంచి చెన్నై, బెంగళూరుకు వలస కార్మికులు ప్రయాణాలు సాగిస్తుంటారు. సాధారణ ప్రయాణికులు కూడా జనరల్ బోగీల్లోనే ప్రయాణం కొనసాగిస్తూ ఉంటారు. రద్దీ వల్ల కిక్కిరిసిపోయి ఉండడంతో చాలామంది బోగీ తలుపుల వద్ద మెట్లపై కూర్చుంటారు. వేగంగా వెళ్తున్న రైలుకు కొద్దిపాటి కుదుపువచ్చినా.. కూర్చున్నవారికి కునుకుపాటు వచ్చినా జారి పడిపోతున్నారు. క్షణాల్లోనే ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

ఆచూకీ దొరకని మృతులెందరో

మూడు సంవత్సరాలుగా ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధి భీమడోలు రైల్వేస్టేషన్ నుంచి గన్నవరం రైల్వేస్టేషన్ వరకూ కేవలం 61 కిలో మీటర్లలో 2022లో 21 మంది రైలు నుంచి జారిపడి మృతి చెందారు. వీరిలో ఇంకా ఆచూకీ తెలియని వారు 17 మంది ఉన్నారు. 2023లో రైలు నుంచి జారిపడి 27 మంది మరణించగా వీరిలో ఆచూకీ తెలియని వారు 19 ఉన్నారు. 2024లో ఇప్పటి వరకూ జారిపడి మృతిచెందినవారు 27 మంది ఉండగా ఆచూకీ తెలియని వారు 12 మంది ఉన్నారు. భీమవరం గవర్న మెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్ (జిఆర్‌పి) పరిధిలో 7 ప్రధాన పట్టణాల్లో రైళ్ళు రహదారులు ఉన్నాయి. ఇటు కైకలూరు, నర్సాపురం, నిడదవోలు వరకు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది. ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2023, 2024 సంవత్సరాల్లో సుమారు ఇప్పటివరకు 80 మంది రైలు ప్రమాదాలు వల్ల మృతి చెందారు.

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



రైల్వే భద్రత నిబంధనల ప్రకారం ప్రయాణికులు బోగీ లోపలే ఉండాలి. మెట్ల ప్రదేశంలో ఉండకూడదు. రైలు పూర్తిగా ఆగిన తరువాతే దిగాలి. ఒక వేళ తాము దిగవలసిన స్టేషన్ దిగలేకపోతే తరువాత ఆ రైలు ఆగే స్టేషన్‌లో దిగాలి.. ప్రమాదాల్లో మృతి చెందినవారి ఆచూకీ కోసం అన్ని పోలీస్ స్టేషన్లకు వారి ఫోటోలతో సమా చారం పంపిస్తాం. ఆచూకీ తెలియనప్పుడు అంత్యక్రియలు నిర్వహించి అందుకు సంబం . దించిన కేసు ఫైల్‌లో ఫోటోలు భద్రపరుస్తాం.

సైమన్, ఎస్ఐ, ఏలూరు రైల్వేస్టేషన్

ప్రమాదాల్లో మృతదేహాలను రైల్వే పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించి ఐదు రోజుల పాటు వారి బంధువుల ఆచూకీ కోసం ప్రయత్నిస్తారు. ఆచూకీ లభించని పక్షంలో పోస్టుమార్టం నిర్వహించి వారే అంత్యక్రియలు నిర్వహించి అక్కడ రికార్డులలో నమోదు చేయిస్తారు. మృతుని కడసారి ధరించిన దుస్తులు భద్రపరుస్తారు. మృతదేహం ఫోటోలను తీసి ఫైల్‌లో ఉంచుతారు.



ఈ జాగ్రత్తలు పాటించాలి

- రైలు ప్రయాణంలో కొందరు బాత్‌రూమ్‌కు వెళ్ళే సమయంలో రెండు పక్కల ఉన్న తలుపుల వద్ద జాగ్రత్తగా వెళ్ళాలి. రైలు కుదుపుల వల్ల జారిపడే ప్రమాదం ఉంది. అలాగే వాష్ బేసిన్ల వద్ద కూడా అప్రమత్తంగా ఉండాలి.
- చాలా మంది సరదా కోసం, రైలు డోర్‌ల వద్ద ఉన్న మెట్లపై కూర్చొంటారు.. ఆ సమయంలో కుదుపు వస్తే అదుపు తప్పి కింద పడిపోయే ప్రమాదం ఉంది.
- రైలు కదులుతున్నప్పుడు ఎక్కడం గాని, దిగడం గాని చెయ్యకూడదు. రైలు పూర్తిగా ఆయా స్టేష న్లలో ఆగిన తరువాతే ఎక్కడం, దిగడం చెయ్యాలి.
- ఎక్కువగా గ్రామాల్లో ఉన్నవారు ఉదయాన్నే కూలి పనులు, సొంత పనులు నిమిత్తం రైలు వస్తుందని చూడకుండా పట్టాలు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వారు జాగ్రత్తలు పాటిం చాలి. పట్టాల సమీపంలో పశువులను మేపుతూ ఉంటారు. రైలు వచ్చే సమయంలో జాగ్రత్తగా చూసుకోవాలి.
- రైల్వేగేటు వేసినప్పుడు గేటు కింద నుంచి వెళ్ళిపో వాలని చూస్తుంటారు. ఆ సమయాల్లో రైళ్ళను కూడా పసిగట్టరు. రైలు గేటు వేసినప్పుడు రైలు వెళ్ళాక గేటు తీసిన తర్వాతే వెళ్లాలి.
- రైల్వేస్టేషన్‌లలో చాలామంది త్వరగా ప్లాట్‌ఫామ్ నుంచి మరొక ప్లాట్‌ఫామ్‌పైకి వెళ్ళాలని పట్టాలు దాటుతూ ఉంటారు. అది చాలా ప్రమాదం. రైల్వే శాఖ ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్ బ్రిడ్జిలనే వినియో గించాలి.

అప్రమత్తతో ప్రమాదాలు దూరం



రైళ్ళలో ప్రయాణంచేవారు , రైలు పట్టాలు దాటుతున్నవారు జాగ్రత్తలు పాటించాలి. అప్రమత్తంగా వ్యవహరించాలి. కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిం చడం వల్ల ప్రాణాలు కోల్పోతు న్నారు. రైలు ప్రమాదాలపై ఎప్పటి కప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. రైల్వేస్టేషన్‌లలో మైక్‌ల ద్వారా రైలులో ప్రయాణించేవారు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనేదానిపై ప్రచారం చేస్తున్నాం. అప్రమత్తంగా ఉండడం వల్ల ప్రమాదం జరగకుండా చూడవచ్చు.

రమణ, రైల్వే ఎస్ఐ, భీమవరం

ఈ ఏడాది ప్రమాదాల్లో కొన్ని..

- ఈ ఏడాది జనవరిలో నర్సాపురానికి చెందిన బుడ్డిగ శ్రీదేవి అనే మహిళ పాలకొల్లు - భీమ వరం స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందింది. దీంతో ఆ కుటుం బంలో విషాదం నెలకొంది. ఇదే నెలలో భీమ వరం మండలం కొత్తపూసలమర్రు గ్రామానికి చెందిన బస్వాని శ్రీనివాస్ ఉండి - ఆకివీడు రైల్వే స్టేషన్‌ల మధ్యలో పట్టాలు దాటుతుం డగా రైలు ఢీకొని మృతి చెందాడు.
- ఫిబ్రవరిలో భీమవరానికి చెందిన గంటా శ్రీనివాసరావు అనే వ్యక్తి భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ దగ్గర పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందారు.
- ఏప్రిల్ నెలలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌లో రైలు నుంచి జారిపడి మృతి చెందాడు.
- మే నెలలో కాళ్ళ గ్రామానికి చెందిన గుర్రం లక్ష్మీ అనే మహిళ కైకలూరు రైల్వేస్టేషన్‌లో కంగారుగా రైలు దిగుతూ రైలు కింద పడి మృతి చెందింది.
- జూలైలో నిడదవోలు శెట్టిపేటకు చెందిన చావల నాగేశ్వరరావు అనే వ్యక్తి నిడదవోలు - కాల్దరి మధ్య రైలు నుంచి జారి పడి మృతి చెందాడు.

క్రైమ్ కార్నర్

హత్యాయత్నం కేసు నమోదు

పెదపాడు, నవంబరు 17 : పెదపాడు మండలం వసంతవాడలో ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసి కాలిపై నరికిన ఘటనలో హత్యాయత్నం కేసు నమోదు చేశామని పెదపాడు ఎస్ఐ కట్టా శారద సతీశ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన పులపర్తి శ్రీనివాస్ వద్ద అదే గ్రామానికి చెందిన తట్టుకూరి కాసులు కూలి పనులు చేస్తూ ఉంటాడు తాగుడుకు అలవాటు పడిన కాసులు కుటుంబసభ్యులు ఎవరూ లేకపోవడంతో ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 16న శ్రీనివాస్‌ను కాసులు డబ్బులు అడగడంతో తరువాత ఇస్తానని చెప్పగా, ఆదివారం ఉదయం వసంతవాడ మసీదు సెంటర్‌లో కూర్చొని వున్న శ్రీనివాస్‌పై గొడ్డలితో దాడి చేసి కాలిపై బలంగా నరికాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి తమ్ముడు పులవర్తి రవికుమార్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

శుభకార్యానికి వెళ్లొచ్చేసరికి

ఇంటిని దోచేశారు..

2 కాసుల బంగారం, రూ.30 వేల నగదు

కొయ్యలగూడెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):కొయ్యలగూడెం పట్టణంలో షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద బొమ్మా వరప్రసాద్ ఇంటిలో శనివారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. వరప్రసాద్ కుటుంబసభ్యులు శుభకార్యానికి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి ఆదివారం ఉదయం ఇంటికి వచ్చే సరికి నగలు, డబ్బు తస్కరించారని ఫిర్యాదు చేశారు. ఇంటి ప్రధాన ద్వారానికి ఉన్న తాళాలు పగులకొట్టి దొంగలు లోనికి చొరబడ్డారు. బీరువాలోని రూ.30 వేల నగదు, రెండు కాసుల బంగారు దిద్దులు అపహరించారని ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆటోమొబైల్ వ్యాపారి ఆత్మహత్య

ఏలూరు క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆటోమొబైల్ వ్యాపారి ఏలూరులోని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్ప డ్డాడు.తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం వినాయకపురానికి చెందిన గొల్లా సద్గుణరావు (34) బీటెక్ చదివాడు. అతనికి భార్య రెండేళ్ళ కుమారుడు, 20 రోజుల కుమార్తె ఉన్నారు. తన గ్రామంలోని ఆటోమొబైల్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో నష్టం రావడం, అప్పుల పాలైపోవడంతో వాటిని తీర్చే మార్గం కానరాక ఈనెల 16వ తేదీ రాత్రి ఏలూరు నగరానికి వచ్చి ఏలూరు మార్కెట్‌యార్డు సమీపంలోని రైలుపట్టాలపై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సమాచారం ఆదివారం ఉదయం రైల్వే ఎస్ఐ సైమన్‌కు అందడంతో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని వద్ద లభించిన ఆధారాలను బట్టి వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

పంట బోదెలో పడి రజక వృత్తిదారుడి మృతి



ఆచంట, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి) : మద్యం మత్తులో పంట బోదెలో పడి రజక వృత్తిదారుడు మృతి చెందిన ఘటన ఆదివారం ఉదయం కొడమంచిలిలో జరి గింది. కొడమంచిలి సంత మార్కెట్‌లో నివాసం ఉంటున్న రజక వృత్తి దారుడు బండారు నాగేశ్వర రావు (48) శనివారం రాత్రి మద్యం తాగి కొడమంచిలిలో ఆర్అండ్‌బీ రహదారి పక్కన పంట బోదెలో పడి మృతి చెందాడు. ఆదివారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని చూసి బంధు వులకు సమాచారం అందించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. మద్యానికి బానిసై ప్రాణాలు పోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఉంగుటూరు, నవంబరు 17: జాతీయ రహదారిపై కైకరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి గురైన మహబూబ్ నగర్ జిల్లా మాధవపురం గ్రామస్థుడు కమ్ములపల్లి లింగయ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా మాధవపురం గ్రామానికి చెందిన కమ్ములపల్లి లింగయ్య (70) అనే వ్యక్తి ఇంటి నుంచి అలిగి వచ్చి నాలుగు రోజుల నుంచి కైకరం గ్రామంలో ఉంటు న్నాడు. ఇదిలా ఉండగా శుక్రవారం సాయంత్రం లింగయ్య రోడ్డు దాటు తుండగా పూళ్ల వైపు వెళుతున్న ఆటో ఢీకొంది. దీంతో అతని కాలుకు తీవ్ర గాయం కాగా చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడని అతని భార్య ఐలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు చేబ్రోలు ఎస్సై ఎం.సూర్య భగవాన్ తెలిపారు.

విద్యుత్ స్తంభం దిమ్మను ఢీకొని ఒకరి మృతి



కాకినాడ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఎలక్ట్రిక్ పోల్ దిమ్మను ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పశ్చిమగోదా వరి జిల్లా పోడూరుకు చెందిన బెల్లాని సుదర్శన్ (40) వివాహితుడు. భార్యతో విడాకులు కావడంతో మూడేళ్లుగా కాకినాడ జగన్నాథపురం ఘాటీ సెంటర్‌లోని తన అమ్మమ్మ ఇంటివద్ద ఉంటూ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం బయటకు వెళ్తొస్తానని ఇంటివద్ద చెప్పి బైక్‌పై బయలుదేరాడు. ఎన్‌టీఆర్ వారధిపై నుంచి వార్ఫు రోడ్డు వైపు తిరుగుతుం డగా అదుపు తప్పి వంతెన ప్లాట్‌ఫాంపైన ఉన్న ఎలక్ట్రిక్ పోల్ దిమ్మను బలంగా ఢీకొట్టాడు. దీంతో అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వన్‌టౌన్ సీఐ నాగదుర్గారావు సంఘటనా స్థలికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలిం చారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై పోక్సో కేసు

నరసాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోడూరు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ సెలవుపై ఉన్న మానేపల్లి సింగ్‌పై ఆదివారం రాత్రి పోక్సో కేసు నమోదు చేశారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం రాత్రి నరసాపురంలో ఓ ఇంటిలోకి వెళ్లి హెడ్ కానిస్టేబుల్ సింగ్ ఒంటిరిగా ఉన్న బాలిక చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక కాని స్టేబుల్ నుంచి తప్పించుకొని విషయాన్ని బంధువులకు చెప్పింది. హెడ్ కానిస్టేబుల్‌ను నిలదీయగా వారిపై దౌర్జన్యం చేసి దూషణకు దిగాడు. దీంతో నరసాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్సై జయలక్ష్మి విచారించి కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

మద్యం బాటిల్స్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ఏలూరు క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్రంపాడు సెంటర్ వద్ద దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి మద్యం విక్రయిస్తున్నట్లుగా త్రిటౌన్ సీఐ కోటేశ్వరరావుకు సమాచారం అందింది. దీంతో తన సిబ్బందితో దాడిచేసి 20 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేశారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

ముసునూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గోపవరం గ్రామానికి చెందిన గుర్రం రమేష్ (21) విద్యుత్ షాక్‌కు గురై శనివారం రాత్రి మృతి చెందాడు. గ్రామంలో ఉన్న ఆయిల్ బంక్‌లో పనిచేస్తున్న నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లిలో ఉన్న అమ్మమ్మ ఇంటికి శనివారం ఉదయం వెళ్లి రాత్రి సమయంలో సీలింగ్ ఫ్యాన్ బిగిస్తుం డగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురయ్యాడు. బంధువులు రమేష్‌ను చికిత్స నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆదివారం రమేష్ మృతదేహానికి పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. టీడీపీ యువనేత ఉప్పలపాటి గణేష్ రమేష్, వడ్లపట్ల మురళీ, సాయిల అనిల్, చిలకంటి శేషు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలను అందజేశారు. ఇటీవల రమేష్ తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా, చిన్నపాటి ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న కుమారుడు హఠాత్తుగా మృతి చెందడంతో తల్లి, భార్య కన్నీరుమున్నీరయ్యారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్


ఆగిరిపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనసానపల్లి గ్రామంలో పేకాట స్థావరంపై ఆగిరిపల్లి ఎస్ఐ శుభశేఖర్ సిబ్బందితో దాడి చేసి పేకాట నిర్వహించే ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ. 10,500 స్వాధీనం చేసుకున్నారు. మండలంలో కోడిపందేలు, పేకాట నిర్వహించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అసాంఘిక కార్య క్రమాల సమాచారాన్ని 112కు సమాచారం అందించాలని కోరారు. వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.



విజేతలకు మహుమతులు అందిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు తదితరులు

ముగిసిన కాస్మో క్లబ్ టెన్నిస్ పోటీలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రీడలే కాకుండా సామా జిక, వైద్య, విద్యా రంగాల్లో కాస్మో క్లబ్ అందించే సేవలు అభినందనీయమని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. కాస్మో క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన సీహెచ్ బుద్ధావతరం సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో మంత్రి నిమ్మల ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహిస్తున్న క్లబ్ సభ్యులను అభినందించారు.కాస్మో క్లబ్ ప్రెసిడెంట్ గొట్టు ముక్కల గాంధీ భగవాన్ రాజు, వైస్‌ప్రెసిడెంట్ ఆర్ సత్యనారాయణ రాజు, కార్యదర్శి సోమరాజు, గోపాల కృష్ణంరాజు, రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

బ్యాండ్ పోటీలలో పెదతాడేపల్లి గురుకుల పాఠశాలకు ప్రథమస్థానం

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 17 : దక్షిణ భారత రాష్ట్ర అంతర గురుకుల పాఠశాల జోనల్ లెవిల్ బ్యాండ్ పోటీలలో పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానం సాధిం చారని ప్రిన్సిపాల్ భీమడోలు రాజారావు తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని ధావనగిరిలో ఈ పోటీలు జరిగాయన్నారు. కర్ణాటక మంత్రి మల్లికార్జున్, ఎంపీ డాక్టర్ ప్రభామల్లికార్జున్, ఎంఎల్ఏ డీఎస్ అర్జున్, సమగ్రశిక్ష ఎస్‌పీడీ కుర్మారావు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.న్యూఢిల్లీలో జరిగే 2025 రిపబ్లిక్‌డే సాంస్కృతిక కార్యక్రమాలలో ఈ టీం పాల్గొంటుందన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వట్లూరు గురుకుల విద్యార్థినులు

పెదపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు పోలసానిపల్లిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థల జోనల్ లెవల్ ఆటల పోటీల్లో పెదపాడు మండలం వట్లూరు డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు కబడ్డీ పోటీల్లో మొదటిస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థల అడిషనల్ సెక్రటరీ సునీల్ రాజ్‌కుమార్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నట్టు వట్లూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి తెలిపారు. విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు టి.సునీలకుమారి, జి.భవానీ తదితరులు పాల్గొన్నారు.



విలువిద్య క్రీడాకారిణి హంసినికి కలెక్టర్ అభినందన

భీమవరం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ విలువిద్య పోటీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించిన భారతీయ విద్యాభవన్స్‌లో 11వ తరగతి చదువుతున్న సూర్య హంసినిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అభినందించారు. ఆదివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ నాగరాణిని హంసిని కలుసుకుంది. కోగా ఆమెను కలెక్టర్ అభినందించారు. హంసిని తల్లిదండ్రులు ఎం.రాజ గోపాల్ చౌదరి, ఎం.ప్రవళిక, భారతీయ విద్యా భవన్ చైర్మన్ యూ.కె విశ్వనాథరాజు, సెక్రటరీ కం కరస్పాండెంట్ సామంతపూడి శ్రీరామరాజు, ఎక్స్ అఫీషియో మెంబర్ కె.వెంకట శ్రీమన్నారాయణ, ప్రిన్సిపాల్ డీ.జె దేవి పద్మ, ఆర్చరీ కోచ్ కమల్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

200 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ వితరణ

నరసాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి); చదువుల్లో రాణిస్తున్న పేద విద్యార్థులకు రాయల్ క్లబ్ అండగా ఉంటుందని ప్రముఖవ్యాపారవేత్త తులసి రామచంద్ర ప్రభు అన్నారు. ఆదివారం తెలగ కళ్యాణ మండపంలో రాయల్ క్లబ్ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్కాలర్‌షిప్‌ల పంపిణి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి, చదువుల్లో రాణిస్తున్న 200 మంది విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందించి మాట్లాడారు. డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, డాక్టర్ అందే సతీష్, జక్కం బాబ్జీ, పోలిశెట్టి రాఘురాం, యర్రంశెట్టి పణికర్‌లు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణంపై ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

భీమవరం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వర్షానికి లోతట్టు ప్రాంతం మునిగిపోయి ఉండేదని అటువంటి రోడ్లకు కల్వర్టు నిర్మించి నూతన రోడ్లను మంజూరు చేయించిన ఎమ్మెల్యే అంజిబాబుకు మాజీ కౌన్సిలర్, జనసేన నాయకులు మాగాపు ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలీ శాశ్వత మఠం ఏర్పాటు చేయాలి

తాడేపల్లిగూడెం అర బ్సన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలీలకు తిరుమల తిరుపతి దేవస్థానం కొండపై శాశ్వత మఠం కల్పించాలని పద్మశాలీ సంఘ రాష్ట్ర కన్వీనర్ బండారు బెనర్జీబాబు కోరారు. ఆదివారం రాజమండ్రి నగర సేవా సంఘ పద్మశాలీ వన సమరాధన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేశవభట్ల విజయ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో 'బొలిశెట్టి' దంపతుల పూజలు

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తనకు ఇచ్చిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ విప్ అయిన సందర్భంగా ఆదివారం తిరుమల వేంకటేశ్వరస్వామిని, కాళహస్తిలోని కాళహస్తీశ్వరస్వామిని కుటుంబంతో సహా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే బొలిశెట్టిని శాలువాతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందించారు.

నేడు షరీఫ్, కొత్తపల్లికి సన్మానం

నరసాపురం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నామినేటెడ్ పదవులు దక్కించుకున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడుకు టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం సత్కరించనున్నట్లు ఆ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి తెలగ కళ్యాణ మండపంలో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయకర్ పాల్గొంటారన్నారు.

మావుళ్లమ్మకు పత్తిపాడు ఎమ్మెల్యే పూజలు

భీమవరం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ అమ్మవారిని ఆదివారం గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయు దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరుపున శేష వస్త్రాన్ని ప్రసాదాన్ని అందించారు. సహాయ కమిషనర్ బుద్దామహాలక్ష్మి నగేష్ ఉన్నారు.

బాబా ఆలయ వార్షికోత్సవం

అత్తిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి సంత మార్కెట్‌లో షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు అత్తిలి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 19న బాబా ఊరేగింపు, 25న అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్ల పంపిణీ

పాలకొల్లు అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి స్థానిక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో చలికి ఇబ్బందులు పడుతున్న రోడ్లపక్కన ఉన్న పేదలకు దుప్పట్లు పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌వి సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు, ఎపియుడబ్ల్యూజే జిల్లా కోశాధికారి ముత్యాల శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు పిటి వెంకటేశ్వరరావు, మండెల అప్పలరాజు, తమ్మినీడి మురళి, జెఎస్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.



పెనుమంత్రలో పద్యపఠన పోటీలు

గ్రంథ పఠనంతో ఉజ్వల భవిత

▸గ్రంథాలయ వారోత్సవాల్లో వక్తలు ▸ విద్యార్థులకు పలు పోటీలు

భీమవరం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థికి గ్రంథ పఠనం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం వార్డెన్ భానుమణి అన్నారు. చదువరుల సంఘం, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. బార్ అసోసియేషన్ సభ్యుడు ఉండపల్లి రమేష్ నాయుడు, సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రమణ్యం, కన్వీనర్ రంగసాయి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయ ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.

ఇరగవరం: రేలంగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఎం.భాస్కర్‌రావు, అడ్డాల వెంకటరావు, సెక్రటరీ చేగొండి హరిబాబు, ప్యానెల్ మెంబర్స్‌గా వ్యవహరించారు.

పెంటపాడు: విద్యార్థులు చిన్ననాటి నుంచే పత్రికలపై అవగాహన కలిగి ఉండాలని గ్రంథాలయాధికారి ఎండీ జుల్ఫికర్ ఆలీ అన్నారు. పెంటపాడు నక్కా వెంకటేశ్వరరావు మెమోరియల్ శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వారోత్సవాలలో భాగంగా ఆదివారం సామాజిక చైతన్యంలో పత్రికల పాత్ర అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

ఆకివీడు: గ్రంథాలయాలు వ్యక్తిత్వ వికాసానికి పునాదిరాయి అని శాఖా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దాసరి వెంకట సత్యనారాయణ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీలు, కవి సమ్మేళనాలు, రచయితల సందేశాలు, సెమినార్లు నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పెనుమంత్ర: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పద్య పఠనం పోటీలు నిర్వహించారు. వాస్తవిక విషయాలను పద్యాల రూపంలో అందించిన తెలుగు కవులు గొప్పతనాన్ని పద్య పఠనం ద్వారా వివరించిన విద్యార్థులను వక్తలు అభినందించారు.



పెంటపాడులో వక్తృత్వ పోటీలు

రైతుల్ని ఆదుకోవాలి

నరసాపురం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలతో ఏటా నష్టపోతున్న రైతుల్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సొసైటీ మాజీ అధ్యక్షుడు కలవకొలను తాతాజీ డిమాండ్ చేశారు. ఆదివారం సొసైటీ వద్ద రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ తీరంలో వందలాది మంది రైతులు సార్వా పంట నష్టపోయారన్నారు. రైతుల్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పరికరాలు, డ్రోన్‌లు, యంత్రాలు, విత్తనాలను, నాణ్యమైన ఎరువుల్ని సరఫరా చేయాలన్నారు.



కళ్ళజోళ్ల వితరణ

కాళ్ళ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు సేవలు అభినందనీయమని కాళ్ళ ఎస్ఐ ఎన్. శ్రీనివాసరావు అన్నారు. కాళ్ళకూరులో ట్రస్టు అధినేత దాట్ల వెంకటరామరాజు ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు ఉచిత కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. గ్రామంలో ఇటీవల నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో కళ్ళజోళ్ళు అవసరమైన సుమారు 150 మందికి సుమారు రూ.90 వేలు విలువైన కళ్ళజోళ్ళను రామరాజు వితరణ చేశారు.



ఉచిత వైద్య శిబిరం

ఆకివీడు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులపేటలో కనుమూరు రాజీవ్ వర్మ మెమోరియల్ ఉచిత వైద్య శిబిరం కనుమూరి శేఖర్ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. భీమవరానికి చెందిన డెంటల్ కేర్ ఆసుపత్రి, ఐడియల్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రుల వైద్యులు సుమారు 200 మందికి వైద్యసేవలు అందించారు. సర్పంచ్ నల్లపరాజు వెంకటరామరాజు, వైద్యులు వేణువర్మ, సూర్యసామిత్ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: స్థానిక వర్తనం రోడ్డులోని డాక్టర్ బాబ్జి తోటలోని అపార్ట్‌మెంట్ వద్ద యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలు, చిన్నారులకు ఉచితంగా కన్ను, ముక్కు, చెవి, దంత పరీక్షలు నిర్వహించారు. ఈఎన్‌టి డాక్టర్ రుద్రరాజు జయ దుర్గాదేవి, దంత వైద్యురాలు పెనుమాక భార్గవిలు వైద్య పరీక్షలు నిర్వహించారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

98 ఎంటీఎస్ టీచర్ల సమస్యలపై మంత్రికి వినతి

పాలకొల్లు అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 98 ఎంటీఎస్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుకు ఆ సంఘ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఆదివారం మంత్రి కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. సుబ్బా రాయుడు వినతి పత్రం అందజేసి మాట్లాడుతూ తవ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన నిమ్మల మంత్రి లోకేష్‌తో మాట్లాడతానన్నారు. సంఘ నాయకులు పి. బెనర్జీ, కేశవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి పుస్తకాల వితరణ

పాలకొల్లు అర్బన్, నవంబరు 17: (ఆంధ్రజోతి) : పెద్ద గోపురం సెంటర్‌లో వారాహి ఫ్లెక్సీ అధినేత గేదెల లక్ష్మణరావు, బృందావనం ఆసుపత్రి సంయుక్తంగా భక్తులకు రుద్రాభిషేకం చేసే విధానం, సోమవారం నిత్య పూజ విధానం భక్తి పుస్తకాలను సుమారు 5000 మందికి అందజేసారు. బీజేపీ పట్టణ అధ్య క్షుడు జక్కంపూడి కుమార్, డాక్టర్ ముచ్చర్ల సంజయ్ రాము గురుస్వామి తదితరులు పుస్తకాలను అందించారు.

కనకరాజు సూరికి అభినందన

ఉండి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న కనకరాజు సూరిని ఉండి మండల కాపు నాయకులు మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు దాసరి వెంకటకృష్ణ, మండల రేషన్ డీలర్లు సంఘం అధ్యక్షుడు చెన్నంశెట్టి దుర్గాప్రసాద్(బాబి)లు అభినందించారు. ఆదివారం ఉండి నుంచి భీమవరంలో కనకరాజు సూరి నివాసానికి వెళ్లి పూలమాలతో, శాలువాకప్పి సత్కరించారు.

జగన్ వెళ్లకుంటే నాయకులేం చేస్తున్నారు?

▸వైసీపీ శ్రేణుల వాకౌట్ ▸వాడీవేడిగా యలమంచిలి మండల పరిషత్ సమావేశం

యలమంచిలి, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): జగన్ అసెంబ్లీకి వెళ్లకపోతే వైసీపీ నాయకులు ఏం చేస్తున్నారని పెదలంక సర్పంచ్ తాళ్ల నాగరాజు వైసీపీ ప్రజా ప్రతినిధులను ప్రశ్నించారు. యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో ఆది వారం వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుమర్రు సర్పంచ్, వైసీపీకి చెందిన కవురు గోపి సమావేశాలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వంటి ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తున్నారా.. కొత్త ప్రభుత్వం వచ్చి కొన్ని నెలలు కావచ్చిందని మాకు సమస్యలు ఉంటే ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. దీంతో పెదలంక సర్పంచ్, టీడీపీకి చెందిన తాళ్ల నాగరాజు మాట్లాడుతూ సమావేశానికి అధ్యక్షత వహిస్తున్న వైస్ ఎంపీపీకి, అధికారులకు సమస్యను తెలియజేయాలని చెబుతున్న నేపథ్యంలో వైసీపీకి చెందిన పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు తాళ్ల నాగరాజుతో వాగ్వాదానికి దిగిన సమయంలో ఆయన పై విధంగా స్పందించారు. ఎంపీడీవో ఎన్.ప్రేమాన్విత మాట్లాడుతూ ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులందర్నీ ఆహ్వానిస్తున్నామన్నారు. అనంతరం వైసీపీకి చెందిన ఎంపీటీసీలు, సర్పంచులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అనంతరం వివిధ శాఖల ప్రగతిని ఆయా శాఖల అధికారులు వివరించారు. ఎంపీటీసీలు చిలుకూరి రాజ్యలక్ష్మి, జిల్లెళ్ల రత్నంరాజు, ఇంటి సూర్యారావు, సర్పంచులు కొండేటి జీవరత్నం, బర్రె మేరీ తదితరులు పాల్గొన్నారు.



వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

ఘనంగా విప్ నాయకర్ జన్మదిన వేడుక

నరసాపురం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నరసాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ జన్మదిన వేడుక ఆదివారం కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణ కార్యాలయం వద్ద పట్టణ, మండల, మొగల్తూరు మండలాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, కొత్తపల్లి జానకిరామ్, ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు విచ్చేసి నాయకర్‌కు శుభా కాంక్షలు తెలిపారు. పలుచోట్ల కేక్ కట్ చేశారు.



వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి వర్మ, రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే బండారు

మొగల్తూరు: విప్ బొమ్మిడి నాయకర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి చిన్నా జన్మదిన వేడుకలు ఆదివారం సాయంత్రం మొగల్తూరు ఎస్ఆర్ బంక్ వద్ద జనసేన, టీడీపీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇరు నాయకులుకు వేర్వేరుగా భారీ కేక్‌లు కట్ చేసి అభిమానులకు పంచారు.

క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌కు ఎమ్మెల్యే సత్కారం

భీమవరం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కనకరాజు సూరిని ఎమ్మెల్యే అంజిబాబు కలిసి సత్కరించారు. అలాగే క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ గా ఎంపికైన యారకరాజు సత్యవారిహరరాజును ఎమ్మెల్యే అభినందించారు.

గణపవరం:కూటమి ప్రభుత్వం క్షత్రియుల సంక్షేమానికి కృషి చేస్తుందని రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న కనకరాజుసూరి అన్నారు. సోమవారం భీమవరంలోని ఆయన స్వగృహంలో గణపవరం మండల టీడీపీ అధ్యక్షుడు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన ఇందుకూరి రామకృష్ణంరాజు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



కనకరాజు సూరికి ఎమ్మెల్యే అంజిబాబు సత్కారం

అద్దేపల్లి వాసురాజు, కూసంపూడి సురేంద్ర కుమార్‌రాజు తదతరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలసిన రజక కార్పొరేషన్ డైరెక్టర్

భీమవరం టౌన్: రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి ఉప్పులూరి చంద్రశేఖర్ ఎమ్మెల్యే అంజిబాబును క్యాంప్ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సభ్యత్వ నమోదులో హ్యాట్రిక్ సాధించాలి : మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో పాలకొల్లు నియోజకవర్గం మరోసారి హ్యాట్రిక్‌ను సొంతం చేసుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకొల్లు నియోజకవర్గానికి వస్తే పది రోజుల్లో 48 వేల 900 సభ్యత్వాలు పూర్తయ్యాయన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పార్టీ పట్టణ, మండ లాల టీడీపీ అధ్యక్షులు గండేటి వెంకటేశ్వరరావు, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, మామిడిశెట్టి పెద్దిరాజు, కోడి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడికి ఘన నివాళి

పెనుమంత్ర/పాలకొల్లు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సోదరుడు రామ్మూర్తి నాయుడు మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం నారావారి పల్లెలో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, నారా రోహిత్ కలిసి ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు. కాగా పాలకొల్లులో రామ్మూర్తినాయుడు చిత్రపటానికి మంత్రి నిమ్మల పూలమాలవేసి నివాళులర్పించారు.

నరసాపురం: పార్టీ కార్యాలయంలో ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో రామ్మూర్తి నాయుడు మృతిపట్ల మౌనం పాటించారు. జక్కం శ్రీమన్నా రాయణ, కొల్లు పెద్దిరాజు, గుబ్బల నాగరాజు తదితరు లు పాల్గొన్నారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు నారావారిపల్లికి వెళ్లి రామ్మూర్తి నాయుడు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



రామూర్తినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పితాని

తాడేపల్లిగూడెం అర్బన్: రామ్మూర్తినాయుడి మృతి బాధాకరమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక పార్టీ కార్యా లయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పట్నాల రాంపండు, పద్మనాభుని మురళి, సర్పంచ్ పీతల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలల సందడి

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. నృత్యాలతో అలరించారు. సంగీతంలో వీనుల విందు చేశారు. తాడేపల్లిగూడెం మొక్క రాల గ్రీన్ మెడోస్‌లో బాలల దినోత్సవంలో భాగం గా పోటీలను నిర్వహించారు. రన్నింగ్, సైకిల్ రేస్, క్రికెట్, కప్పదాటు, మ్యూజికల్ చైర్‌వంటి పోటీ లను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. టీడీపీ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, మొక్కరాల విశ్వనాథం, కృష్ణప్రసాద్, జగన్నా థం, కొర్లపర సూరిబాబు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిన్నారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రారంభించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



బహుమతుల ప్రదానోత్సవంలో వలవల బాబ్జి తదితరులు



కోడూరి ప్రభాకర్‌రెడ్డికి పురస్కారం ప్రదానం

కవి కోడూరికి సాహితీ పురస్కారం

ఇరగవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు వైద్యుడు, ప్రముఖ కవి కోడూరి ప్రభాకర్‌రెడ్డికి సాహితీ పురస్కారాన్ని వత్సవాయి వెంకటరాజు, సత్యవతి దంపతులు ప్రదానం చేసి సత్కరించారు. ఆదివారం తణుకులో వత్సవాయి సాహితీ పురస్కారం-2024 అవార్డుల కార్యక్రమాన్ని రసరాజు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యే ఎంవీ కృష్ణారావు, వత్సవాయి ఫౌండేషన్ సేవలను కొనియాడారు. రసరాజు రచించిన క్షత్రియ గీతాన్ని డాక్టర్ గజల్ శ్రీనివాస్ సంగీత దర్శకత్వంలో కాకరపర్తి కామేష్ నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం ప్రొద్దుటూరుకు చెందిన కవి కోడూరి ప్రభాకర్‌రెడ్డి రచించిన 'మీరా భజనలు' గ్రంథాన్ని వత్సవాయి సత్యవతికి అంకితం చేయగా తాతిన రామబ్రహ్మం, డాక్టర్ కె.రామచంద్రరాజు ఆవిష్కరించారు. చివటం సుబ్బారావు, బి.శ్రీధర్ గానం చేశారు. కార్యక్రమంలో విజయ షణ్ముఖి, జీఆర్‌కే రాజు, కామేష్ పాల్గొన్నారు.

సాహిత్యం సమాజాన్ని నడిపిస్తుంది..

సాహిత్యం సమాజాన్ని నడిపిస్తుందని సామాజికవేత్త డీవీవీఎస్ వర్మ సాహిత్యం గొప్పదనాన్ని వివరించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో కవి సమ్మేళనం జరిగింది. రిటైర్డ్ ఆంగ్ల భాష అధ్యాపకులు కోట రామప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవి సమ్మేళనంలో కోట రామప్రసాద్ తమ కవిత బంగారు బాల్యం గురించి సాహితీ సామ్రాజ్యం వ్యవస్థాపకుడు తాడినాడ భాస్కరరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కవి మోహనప్రసాద్, ఎస్. శ్రీనివాస్ కవితలు వినిపించారు. ముఖ్యఅతిథి డీవీవీఎస్ వర్మను సత్కరించారు. రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం, జి.ఉష, చింతపల్లి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



పిప్పరలో రచయిత్రి శారదాదేవికి సత్కారం

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

భీమవరం టౌన్: సమాజ హితమే సాహిత్యమని సాహితీవేత్త అక్షర కిరీటి తెన్నేటి మాస్టారు అన్నారు. ఆదివారం భీమవరం ప్రథమశ్రేణి గ్రంథాలయంలో లో జరిగిన కవి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కలిగొట్ల గోపాల శర్మ, అప్పన్న మాస్టారు, చివటం శ్రీనివాసరావు మాస్టారు కవితలు సభికులను ఆకట్టుకున్నాయి. అనంతరం కవి పండితులకు సన్మానం జరిగింది. సన్మానించారు. గ్రంథాలయ అధికారి శ్రీ ఎస్ వెంకటేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది సోమరాజు పాల్గొన్నారు.

గణపవరం: పిప్పర గ్రంథా లయంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. రచయిత శారదాదేవి పాల్గొని ప్రాచీన కవులు, ఆధునిక కవుల గురించి వివరించారు. గజేంద్ర మోక్షం, మనుచరిత్రలపై విశదీకరించారు. ఈ సందర్భంగా శారదాదేవిని సత్కరించారు. గ్రంథాలయాధికారి రంగారావు పాల్గొన్నారు.



గునుపూడి బ్రాహ్మణ సమాఖ్య తరఫున ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం



మంత్రి నిమ్మల రామానాయుడుని సత్కరిస్తున్న కమ్మ సంఘ నాయకులు



దామోదర పూజలు చేస్తున్న రవీంద్ర రాజు దంపతులు



కిరాణా వర్తక సంఘ వన సమారాధనలో మాజీ ఎమ్మెల్యే బంగారు ఉషారాణి



ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహిస్తున్న ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు

వన సమారాధనల సందడి..

భీమవరం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భీమవరం ప్రకృతి ఆశ్రమంలో శ్రీఉమా సోమేశ్వర గునుపూడి భీమవరం బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాహ్మణ కార్తీక వన సమారాధన నిర్వహించారు. ముందుగా వేలూరి శేషగిరిరావు, బాల త్రిపుర సుందరి దంపతులు పూజలు నిర్వహించారు. పట్టణంలోని విష్ణు కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం విద్యార్థి అబ్బురాజు పవన్ కళ్యాణ్‌కు బ్రాహ్మ ణ సమాఖ్య తరుపున రూ. 50 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. సమాఖ్య అధ్యక్షుడు వేలూరి హనుమ కిరణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: కమ్మవారు అంటే అన్ని రంగాల అభివృద్ధికి ముందుంటారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక బ్రాడీపేట బైపాస్ రోడ్డులోని ఫంక్షన్‌హాల్లో కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధన కు మంత్రి ముఖ్య అతిధిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మలను ఘనంగా సత్కరించారు. సంఘ అధ్యక్షుడు నెలకుర్తి చెంచయ్య, కార్యదర్శి సత్యనారాయణరావు, యువజన సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: పట్టణంలో కిరాణా వర్తక సంఘం ఆధ్వర్యంలో వర్తక సంఘం భవనంలో అధ్యక్షుడు ఎస్ భవన్నారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బంగారు ఉషారాణి పాల్గొన్నారు. అలాగే లయన్స్ క్లబ్ హాల్లో జరిగిన దేవ తిలకుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్ షిప్పులు, మహిళలకు కుట్టుమిషన్లు, ఇంకా పలు సేవా కార్యక్రమాలు చేశారు. ఏఎంసీ ఆవరణలో యాదవ సంఘ నాయకుల ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధనలో శ్రీకృష్ణుని పూజలు ప్రత్యేకంగా చేశారు. బీఆర్ఎంవీఎం హైస్కూల్ వద్ద తోటలో దేవాంగుల సంఘం ఆధ్వర్యంలోనూ, పూలపల్లి బైపాస్ రోడ్డులోని తోటలో పద్మశాలీల సంఘం ఆధ్వర్యంలోనూ, పెనుమదం రోడ్డులోని పాలకొలను సర్వేశ్వర లింగం తోటలో శాలివాహన కుమ్మర సంఘం ఆధ్వర్యంలోనూ వన సమారాధనలు అత్యంత వేడుకగా జరిగాయి.

పెనుగొండ: శెట్టిబలిజ, గౌడ సంఘం ఔన్నత్యాన్ని కాపాడాల్సిన బాధ్యత యువత పైనే ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం వ్యవసాయ మార్కెట్ యార్డులో పెనుగొండ శెట్టిబలిజ, గౌడ 11 సంఘా కార్తీక వన సమారాధన పాల్గొని మాట్లాడారు. పితాని వెంకట్ కార్తీక దామోదరానికి పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు ప్రసంగించారు. శెట్టి బలిజ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కుడిపూడి సత్తిబాబును సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు.

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్‌బీ చర్ల గ్రామంలో ఆదివారం గౌడ, శెట్టి బలిజ కార్తీక వనసమారాధన నిర్వహించారు. మహిళలు, పిల్లలకు పలు వినోద కార్యక్రమాలు నిర్వహించి బహుమతులందించారు. మాజీ ఎమ్మెల్సీ శేషుబాబును సత్కరించారు. కుక్కల మీరయ్య, దొంగ మురళి, గుబ్బల రాధాకృష్ణ, బొక్కా రాధాకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాలకోడేరు: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పాలకోడేరు గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన మహోత్సవం ఆహ్లాదకరంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రజలంతా తెలియని యాప్ లు, లింకులు ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్ల వలలో పడుతున్నారని జాగ్రత్తగా ఉండాలని సూచించారు.. గౌడ సంక్షేమ సంఘ ముఖ్య నాయకులు, పెద్దలు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

అత్తిలి: ఆరవల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం కార్తీక వనసమారాధన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని వన భోజనాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకివీడు: ఐక్యతకు ప్రతీకలు కార్తీక వనసమారాధనలని ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు అన్నారు. గౌడ, శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. సంఘం ప్రముఖులతో పాటు టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి తదితరులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన ఆర్యవైశ్య కళ్యాణమందిరంలో జరిగింది.

మొగల్తూరు: మొగల్తూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, మొగల్తూరు గౌడ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధనలు ఘనంగా జరిగాయి. మొగల్తూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కారుమూరి రామకృష్ణ శిరిష దంపతులు సత్యనారాయణ స్వామివారి వ్రత మహోత్సవాన్ని నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు బుడ్డిగ బాలరాజు తదితరులు పాల్గొన్నారు. శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు మామిడిశెట్టి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

పెనుమంత్ర: పెనుమంత్రలో క్షత్రియ వన సమారాధన గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు దంపతులు పూజలు చేశారు. ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. క్షత్రియ పెద్దలు పాల్గొన్నారు.



వనమహోత్సవంలో మాట్లాడుతున్న ఎస్ఐ రవివర్మ